నాకు నచ్చిన నా కథ

చదివింది తక్కువే అయినా, అతి చిన్న వయస్సులోనే కథారచన చేయడం ప్రారంభించాను. చిన్న వయస్సులో రాసిన కథలు : ఇంగితశూన్యులు, గాయపడిన మది, నిరీక్షణ, పగ, 'డబ్బు! డబ్బు!' ఈ కథలన్నింటిలో నాకు బాగా నచ్చినది "పగ." తర్వాత చదువులో మునిగిపోయాను. కథారచనకి కొంత అంతరాయం ఏర్పడింది. చదువు ముగించాక మళ్ళీ కథారచన ప్రారంభించాను. ఫలితంగా డెబ్బై కథలు, పాతిక వ్యాసాలు, ఆరు కవితలు, ఆరు నవలలు, మూడు నాటికలు రాశాను. నా కథలు, వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. చిన్న వయస్సులో అతిస్వల్ప వ్యవధిలో రాసిన ఈ "పగ" నాకు నచ్చింది.

మరి ఇక పాఠకుల అభిప్రాయం కూడా తెలిపితే సంతోషిస్తాను.

ఇట్లు
బద్దెపూడి సుధారాణి
చీరాల

పగ

"సత్తిరాజు నోట్లో చుట్టతీసి తుపుక్కున ఊసి కండువా తీసి గట్టిగా దులిపి బుజంమీద విసురుగా వేసుకుని, ఇదే ఆఖరిసారి అన్నట్లుగా వెంకట్రామయ్య ముఖంలోకి చూస్తూ అడిగాడు. సత్తిరాజు కళ్ళల్లో ఎర్రజీరలు చూచి వులిక్కిపడ్డాడు వెంకట్రామయ్య.

"ఏం బావా! ఇంక కాదన్నమాటేగా నీవు అనబోయేది?" కటువుగా వుంది సత్తిరాజు మాట్లాడిన తీరు.

"నా చేతుల్లో ఏముంది సత్తిరాజూ? అంతా వాడి యిష్టం. నేనేం చేసేది?" వెంకట్రామయ్య అమాయకత్వం పులుముకుని ముఖంలో తన తప్పు ఏమీలేదు

యిందులో అన్నట్లు దీనంగా మాట్లాడాడు. వెంకట్రామయ్య నక్క-వినయానికి, సత్తిరాజుకి వళ్లు భగ్గుమని మండింది. రోషంతో వుడికిపోయాడు.

"ఇదిగో. ఆఖరిసారిగా చెబుతున్నాను. ఎంత అయినా, తెలిసినవాడివి, కావల్సినవాడివి.

"పదివేలు ఇస్తాను. కాదనకు. ఆలోచించుకో. కాదు, కూడదు అనుకున్నావంటే బంధుత్వాలు దూరమయినాయని బాధపడితే మాత్రం ప్రయోజనం లేదు. చివరికిగాని తెలిసిరాదు." అంటూ, సత్తిరాజు నోట్లో చుట్టతీసి దూరంగా విసిరికొట్టి, గాండ్రుమని కేకరించి, వుమ్మేసి బయలుదేరాడు, వెనక్కి తిరిగి చూడకుండా.

వెంకట్రామయ్య రెండు చేతులతో నుదురు రుద్దుకుంటూ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"ఏమిటండీ, ఒంట్లో బాగుండలేదా ? అట్లా కూర్చున్నారు." అంటూ వచ్చింది భార్య లక్ష్మమ్మ.

"ఒంట్లో బాగుండక పోవటమేం కర్మ. నిక్షేపంగా వున్నాను."

"సత్తిరాజు వచ్చి వెళ్ళాడు చూచావా ?"

"ఏమిటీ ? సత్తిరాజు అన్నయ్య వచ్చి వెళ్ళాడా ? నా మతి మండిపోనూ. నేను ఇందాకటి నుండి పక్కింట్లో కూర్చున్నానులెండి. ఏమిటి విశేషం. పిల్లదానికి పెళ్ళిగాని ఏమన్నా కుదిరిందటనా ?" అమాయకంగా అడిగింది. లక్ష్మమ్మ భర్తముఖంలోకి చూస్తూ.

"నీ తెలివి తెల్లారినట్లే వుంది. దానికి కుదిరితే మనకి బాధ ఎందుకే ? అందుకే వచ్చాడు. మన హరికి తన కూతుర్ని ఇస్తాడుట. పదివేలు యిస్తానంటున్నాడు." ఎగతాళిగా అన్నాడు వెంకట్రామయ్య.

"అదేమిటండి అట్లా అంటారు ? ఇంతదానికే అంత విచారమెందుకు ? సంతోషించాల్సింది పోయి. పది వేలంటే మాటలా ? పైగా సత్తిరాజు, మీరూ చిన్ననాటి నుండి ప్రాణస్నేహితులు కూడాను. ఎందుకు అనవసరంగా మీ మధ్య స్నేహం పోగొట్టుకోవటం ? సత్తిరాజు భార్య సుశీలమ్మకూడ మంచి ఇల్లాలే. పిల్ల నలుపేగాని బుద్ధిమంతురాలు. చదువు అంటే అబ్బలేదు. పోనీలెండి ఒక్కగా నొక్క కూతురు. సత్తిరాజు, సుశీలమ్మ పోయాక, ఆ వున్న కాస్త ఆస్తి దానికే కదా ? ఏమంటారు ?" లక్ష్మమ్మ నెమ్మదిగా అన్నది. వెంకట్రామయ్య ఏం చెబుతాడో అని ఆశగా చూస్తూ.

"చాల్లె నీ ఉపన్యాసం యింక అపు...." వెంకట్రామయ్య అరుపులకి అదిరి పడింది భార్య లక్ష్మమ్మ.

"చదువు చట్టుబండలు లేవు. పైగా నలుపు. ఛీ....ఛీ.... ఆ పిల్లని బోడి పదివేలకి ఒప్పుకుని చేసుకోవటమా ?

"మనవాడి ధర యాభై వేలు పలకవల్సిందే. యివ్వవలసిందే. సత్తిరాజు సంబంధం నా కెందుకు, ఈ వెంకట్రామయ్య అంత తేలిగ్గా ఒప్పుకునే రకం కాదని తెలియాలి. స్నేహమంటే స్నేహమే, డబ్బు దగ్గర మాత్రం ఈ స్నేహాలు కుదరవని తెలియదేమో." వెంకట్రామయ్య హేళనగా అంటున్న మాటలకి లక్ష్మమ్మ బిత్తరపోయి చూసింది.

ఇరుపక్షాలవాళ్ళు ఇంత పట్టుదలలుగా వుంటే మధ్య తను కల్పించు కోవటం బాగుండదేమో అనుకుంటూ చిన్నగా లేచి వంటగదిలోకి పోయి అన్నం వుడుకుతుంటే, పొయ్యి మంట సరిచేస్తూ కూర్చుంది. ఏమిటో ఆలోచ నలు మనస్సుని గందరగోళ పెడుతున్నాయి. ఎటువంటి ప్రాణస్నేహితులు ఎట్లా అయినారోనని లక్ష్మమ్మ తెగ బాధపడిపోయింది.

ఉన్నవాళ్ళలో ఆ ఊరి పెద్దలుగా చెలామణి అవుతున్నారు.

వెంకట్రామయ్య, సత్తిరాజులు, ఒకరికొకరు ప్రాణంగా వుంటారు. ఆ ఊళ్ళో వాళ్ళ చేతులమీదుగా జరగాలి ముందు ఏ పనైనా, మంచిగాని,చెడుగాని.

సత్తిరాజుకి ఏదో కొద్దిపాటి పొలం, ఒక ఇల్లు, రెండు గేదెలు వున్నాయి. మాట మంచితనంతో నెట్టుకొస్తున్నాడు పెద్దమనిషిగా.

వెంకట్రామయ్యకి తన ఆస్తికాక భార్య తరపున పది ఎకరాల పొలం వచ్చింది. మొత్తం డెబ్బై ఎనభై వేలదాక క్యాష్ వుంది. ఒక్కగానొక్క కొడుకు హరిని పట్నంలో మెడిసిన్ చదివిస్తున్నాడు. హరి అందమైనవాడే, తండ్రి అజ్ఞలేనిదే అడుగు అయినా వేయడని పేరు.

సత్తిరాజు కూతురు విశాలి నలుపు. అయినా, సన్నగా నాజూగ్గా వుంటుంది. వినయంగా వుంటుంది. ఆడపిల్లకి ఏం చదువుల్లే, చదివించినా ప్రయోజనం ఏమిటి ? వంట చేయకుండా తప్పదుకదా ? అన్నట్లు సత్తిరాజు కూతుర్ని చదివించలేదు. భార్య పోరగా, పోరగా ఐదు క్లాసులవరకు చదివి ఆపేసింది. సత్తిరాజు-వెంకట్రామయ్య మంచి స్నేహితులే కాకుండా ఒకర్ని ఒకరు, బావా, బావా అని పిల్చుకోవటంతో, ఇద్దరూ దగ్గరవాళ్ళే అనుకునేవాళ్ళు అంతా. హరి విశాలకూడా ఎంతో చనువుగా ఉండేవాళ్ళు. హరికి విశాలినిచ్చి పెళ్ళిచేస్తారనే

వదంతులుకూడా వున్నాయి. ఆ నోట ఈ నోటా విశాలి తరువాత పిల్లలు లేక పోవటం, హరి తరువాత కూడా లక్ష్మమ్మకి పిల్లలు లేకపోవటంతో ఇద్దరూ గారాబంతో అపురూపంగా పెరిగారు.

సంబంధాల కోసం చెప్పులు అరిగేలా తిరిగే పని తప్పినందుకు ఎంతగానో సంతోషించాడు సత్తిరాజు. తన అల్లుడుగా హరినే మనస్సులో వుంచుకున్నాడు సత్తిరాజు.

"బావా! నీవు తెల్లగా చక్కగా వుంటావు. నల్లగావున్న నన్ను చేసుకుంటావా? చదువుకున్నవాడివి. చదువులేనిదాన్ని నన్ను చేసుకుంటానికి నీ మనస్సు ఒప్పుతుందా?" అని చిన్నగా అడిగేది విశాలి.

"ఛ....అలాంటి ఆలోచనలేమీ పెట్టుకోకు. బాహ్య సౌందర్యం ఎవరికీ అక్కర్లేదు. ఆత్మసౌందర్యం కావాలి విశాలా! చదువు లేకపోయినా సంస్కారం వుంటే చాలు. అనవసరమైన ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోకు," అని ఓదార్చేవాడు హరి. ఆ మాటలకి పొంగిపోయేది విశాలి, బావ ఎంత మంచి వాడు అనుకుంటూ.

విశాల పెద్దది అవుతున్నకొద్దీ, సత్తిరాజుకి విశాలి పెళ్ళిగురించి ఆలోచనలు ముసురుకునేవి. హరిని ఎప్పటికప్పుడు అడగాలనుకునేవాడు సత్తిరాజు. కానీ అంతలోనే అనుకునేవాడు, మన చేతిలోవాడు భయమేమిటిలే, నామాట కాదంటాడా! అని.

ఒకరోజు హఠాత్తుగా అడిగాడు హరిని సత్తిరాజు పిలిచి, విశాలితో అప్పటి దాకా చెస్ ఆడి ఇంటికిపోతున్న హరిని.

"హరీ! ఒకసారి ఇటురా! నీతో మాట్లాడాలి."

"ఏమిటి మావయ్యా! నాతోనా మాట్లాడటం?"

"అవునురా! నీతోనే, నీ గురించే!"

"నా గురించా?" బిత్తరపోయాడు హరి, ఈ హఠాత్తు పరిణామానికి.

"అవును నీగురించే. యం.బి.బి.యస్.లో చేరావు. ఇది మొదటి సంవత్సరమే అనుకుంటాను. యింకా నాలుగైదేళ్లు చదవాలి కదా? విశాలికి అప్పుడే పందొమ్మిది ఏళ్లు వచ్చాయి. ఇంకా వుంచటం భావ్యం కాదు, పెళ్ళి చేయకుండా. విశాలికి ఆ మూడు ముళ్లు వేయిస్తే నాకు బాధ వుండదు. నాకు కొంత బరువు తీరినట్టూ వుంటుంది ఏమంటావు?" అంటూ జవాబుకోసం హరి ముఖం లోకి ఆత్రంగా చూస్తూ కూర్చున్నాడు సత్తిరాజు.

హరి చిత్రంగా నవ్వాడు.

"నాదేముంది మావయ్యా! అంతా నాన్న ఇష్టం. నాన్న మాట కాదనేందుకు లేదు, నాన్న ఇష్టమే నా ఇష్టం." హరి చిరునవ్వుతో చెప్పినదానికి, "అంతేనా? నీ ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేదా?" అని బాధగా చూచాడు సత్తిరాజు.

చెప్పవలసింది ఇంకేమి లేదన్నట్లు వెళ్ళటానికి ఉద్యుక్తుడైనాడు హరి.

మౌనంగా కూర్చున్నాడు సత్తిరాజు, హరి వెళ్ళటం చూచి

హరి ఇల్లు చేరేసరికి బాగా పొద్దుపోయింది.

తండ్రి వెంకట్రామయ్య వాకిట్లోనే ఎదురైనాడు.

హరి కొంచం గాబరాపడ్డాడు తండ్రి ముఖం అదోలా వుండటం చూచి.

"హరీ! సత్తిరాజు ఇంటినుండేనా రావటం?"

"అవును నాన్నా!"

"రేపటినుండి నీవు వాళ్ళయింటికి వెళ్ళటం తగ్గించాలి."

"ఏం నాన్నా?"

"నీకు తెలియదు. ఆ సత్తిరాజు తన కూతురికి నిన్ను కట్టబెట్టాలని చూస్తున్నాడు. నాకు ఆ సంబంధం యిష్టంలేదు. నీవా కాబోయే డాక్టరువి ఈ క్షణాన నీకు యాభైవేలు యిస్తారు. అటువంటి అవకాశాలు పోగొట్టుకోవద్దు. సత్తిరాజు యిచ్చే ముష్టి పదివేలకి లొంగటమా? ఏమంటావు?" అన్నట్లు చూచాడు కొడుకు ముఖంలోకి వెంకట్రామయ్య.

హరికి తండ్రిని ఎదిరించే ధైర్యం లేదు, సర్దిచెప్పే శక్తి లేదు.

"నీ యిష్టం నాన్నా!" అంటూ తలొంచుకుని వెళ్ళిపోయాడు.

"కొడుకు అంటే వీడే. తండ్రికి తగ్గ కొడుకు." మీసం మీదకి చెయ్యి పోనిచ్చి, అప్రయత్నంగా విషపునవ్వు ఒకటి విసిరాడు.

ఆనాటినుండి సత్తిరాజు ఇంటికి రాకపోకలు తగ్గినాయి. హరి యం.బి.బి.యస్.లో చేరాడు విశాఖపట్నం వెళ్ళి. హరి డాక్టరు కాబోతున్నందుకు, విశాలి సంతోషంతో పొంగిపోయేది. విశాలి హరికోసం ఎన్నో పూజలు చేసేది. హరి తన భర్త కావాలని, తన మనస్సులో వేరొకనికి చోటు యివ్వవద్దు అని భగవంతుడ్ని మనసారా కోరుకుంది. హరి అశక్తత విశాలి గ్రహించి తెలుసుకోలేకపోయింది.

సత్తిరాజు మాత్రం ఆశ చావక అడపాదడప రాకపోకలు సాగించాడు వెంకట్రామయ్య ఇంటికి. వెంకట్రామయ్య ముభావంగా వుండటం నేర్చుకున్నాడు.

వెంకట్రామయ్యకి పాతికేళ్ళు దాటిన కొడుకు వున్నాడని తెలిసిన బంధువులు, స్నేహితులు, పెళ్ళి బేరానికి రావటం ప్రారంభించారు. సరైన పాట వచ్చేవరకు వేచివుండాలనుకున్నాడు వెంకట్రామయ్య.

ఆశ చావని సత్తిరాజు, ఆఖరిసారిగా ఆరోజు గట్టిగా అడిగాడు వెంకట్రామయ్యని. పదివేలు పోస్తాను, మన స్నేహం పోగొట్టుకోవద్దు, పిల్లలు ఇద్దరూ మన కళ్ళముందే వుంటారు, కాదనవద్దని.

"అవతల ముప్పైవేలు కాలదన్నుకున్నాను నీ పదివేలు ఎంత?" అన్నారు గర్వంగా వెంకట్రామయ్య.

సత్తిరాజులో కోపం బుసలుకొట్టింది. చిన్నప్పటినుండి ఇంత స్నేహంగా వున్నందుకు ఫలితం ఇదా?

వెంకట్రామయ్య సానబెట్టిన కత్తిలా తయారైనాడు. చూద్దాం. నా కూతురికి పెళ్ళి కాకపోతుందా? అనుకున్నాడు సత్తిరాజు ఆవేశంగా.

"భర్తకు వున్న డబ్బు వ్యామోహంలో, స్నేహాన్ని కూడా కాలదన్నుకున్నందుకు, భార్య లక్ష్మమ్మ అసహ్యించుకుంది వెంకట్రామయ్యని మనస్సులోనే.

అంతా విన్న విశాలి ముఖం చిన్నబోయింది. సుశీలమ్మ బాధపడింది సత్తిరాజు భార్య పోరుపడలేక మళ్ళీ హరిపేర ఉత్తరము వ్రాశాడు విశాఖపట్నంకి.

హరీ! విశాల నీమీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. వెంకట్రామయ్యకి నాకు వున్న స్నేహం ఈనాటిది కాదు. నీకు తెలియనిది కాదు. మన మధ్య ఆత్మీయత పెంచుకోవాలని వుందేగాని, తెంచుకోవాలని లేదు. చదువుకున్నవాడివి. అన్నీ తెలిసినవాడివి, డబ్బు శాశ్వతం కాదు. మాట శాశ్వతం నాయనా! ఈ మావయ్య మాట కాదనకు. విశాలి దిగులుపడిపోయింది హరీ. నీ సమ్మతం కోసం ఎదురు చూస్తున్నాను అంటూ వ్రాశాడు.

తిరుగు జాబు రానే వచ్చింది. విశాలి హృదయం సంతోషంతో పొంగిపోయింది. "నా బంగారు తండ్రి హరి ఏమి వ్రాశాడో చదవండి" అంటూ తొందరచేసింది సుశీలమ్మ.

పిల్లాడు దోవలోకి వచ్చాడు. ఫరవాలేదు అనుకున్నాడు సత్తిరాజు ఉత్తరం చదవకుండానే.

ఉత్తరం చదివిన మరుక్షణంలోనే పళ్ళు పటపటలాడించాడు, రోషంగా సత్తిరాజు.

అర్థంకాని సుశీలమ్మ అయోమయంగా చూస్తూ కూర్చుంది.

విశాలి తండ్రి చేతిలోనుండి విసిరివేయబడ్డ ఉత్తరం వణకుతున్న చేతులతో తీసి చదివింది.

"సత్తిరాజు మావయ్యకి,

చిన్నప్పటినుండి విశాలి, నేను కలిసిమెలిసి వున్నంత మాత్రాన, నేను విశాలిని చేసుకుంటా ననుకోవటం పొరపాటు. నాకు బాగా నాతో సమానంగా చదువుకున్న పిల్ల కావాలని, విదేశాలు వెళ్ళాలని కోరికగా ఉంది. నా తోటి వాళ్ళంతా అందమైనవాళ్ళని, గ్రాడ్యుయేట్స్‌ని చేసుకున్నారు. వాళ్ళకన్నా అధికుడ్ని కావాలని కోరికగా వుంది. క్షమించు మావయ్యా. శెలవ్,

హరి.

అంటూ వ్రాశాడు. ఉత్తరం చదువుకున్న విశాలి తనలో తనే కుమిలిపోయింది.

ఉత్తరం చదివిన సత్తిరాజు చిందులు త్రొక్కాడు. ఆవేశంతో, ఈ సత్తిరాజు అంటే ఏమిటో తెలుపుతాను అంటూ హుంకరించాడు. మనిషిని మంచితనంతోనే ముంచాలి. లేకపోతే లాభం లేదనుకున్నాడు సత్తిరాజు వెంకట్రామయ్యతో మామూలుగానే వుంటున్నాడు, సత్తిరాజు అసమర్థతకి నవ్వుతున్నాడు వెంకట్రామయ్య.

విశాలికి మంచి సంబంధమే చూచాడు సత్తిరాజు. వరుడు చదువుకున్నవాడే. చక్కనివాడు కూడా. అన్ని విధాలా తగినసంబంధమే అనిపించింది సత్తిరాజుకి. పెళ్ళి వారం రోజులు వుందనగా లక్ష్మమ్మని, వెంకట్రామయ్యని దగ్గర వుండి తీసుకువచ్చాడు, పెళ్ళి పనులకి సాయంగా. పెళ్ళి వున్నంతలో ఘనంగానే జరిపించాడు.

పెళ్ళికి హరి వచ్చాడు. ఆరోజు అంతా వుండి వెళ్ళిపోయాడు. ఈ పెళ్ళి ఎవరికి తృప్తినిచ్చినా, సత్తిరాజుకి, సుశీలమ్మకి అదోలా వుంది. లక్ష్మమ్మ చాటుగా కన్నీళ్ళు తుడుచుకుంది.

విశాలి పెళ్ళిఅయిన తరువాత, మళ్ళీ వెంకట్రామయ్య, సత్తిరాజు పూర్వ స్నేహితులలాగే వుంటున్నారు.

ఊళ్లో అందరికీ ఇది మరీ విడ్డూరమనిపించింది.

ఆ వూళ్ళో, వెంకట్రామయ్యని మించినవాడు రాఘవయ్య. రాఘవయ్యకు విషనాగు అని పేరు. బాగా వున్నవాడు. మదగజంలాంటి మనిషి. ఎవర్ని ఎట్లా నమ్మించాలో, వంచించాలో రాఘవయ్యకి ఉగ్గుపాలతో నేర్పిన విద్య. సత్తిరాజు చాటుగా రాఘవయ్యతో చేతులు కలిపాడు జరిగినదంతా చెప్పి.

సత్తిరాజుకి తోచని ఉపాయాలు రాఘవయ్య అందించాడు. రాఘవయ్యకి అరడజను సోడాలు కొట్టించి యిచ్చాడు సంతోషంతో.

మర్నాడు వెంకట్రామయ్య వాకిట్లో రాఘవయ్య ప్రత్యక్షమైనాడు.

"ఓహో బావా! ఆశ్చర్యంగా వుందే. ఎన్నాళ్ళకి, ఎన్నాళ్ళకి వచ్చావు! రా... రా" అంటూ ఎదురేగి ఆహ్వానించాడు వెంకట్రామయ్య రాఘవయ్యని.

"ఏందోలే బావా! ఎప్పటికి అప్పుడు రావాలనుకోవటం తీరడంలేదనుకో. ఇవాళ తప్పనిసరిగా రావాలనుకుని వచ్చాననుకో" రాఘవయ్య నవ్వుతూ అన్నాడు.

"ఊరక రారు మహాత్ములు! ఏమిటో విశేషం?" వెంకట్రామయ్య తమాషాగా అన్నాడు.

"ఏముంది బావా! మన హరికి ఫస్టుక్లాసు సంబంధం తెచ్చాను. పిల్లని చూస్తావుగా, పిల్లని గురించి చెప్పే పనే లేదనుకో. చదువుకి లోటులేదు, కట్నం నీవెంత అడిగితే అంతే. కాదనేందుకు లేదు మరి. ఏమంటావు? నీదే ఆలస్యం. పిల్లని చూడటానికి ఎప్పుడు పోదామంటావు?"

"నాదేముంది బావా! పెద్దవాడివి, నీమాట కాదనేంతటివాడినా!" వెంకట్రామయ్య సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ అన్నాడు.

"ఇంకేం శుభస్య శీఘ్రం."

"అయితే బావా! ఇంతకీ పిల్ల ఎవరు?"

"ఓరినీ అసాధ్యం కూల. అసలు సంగతి నీకు చెప్పనే లేదా?" అంటూ గారపట్టిన పళ్ళు బయటపెట్టి, భళ్ళున నవ్వాడు. వెంకట్రామయ్య సంతోషంతో శృతికలిపాడు.

"మా దూరపు బంధువులే! పిల్లకి తల్లి తప్ప తండ్రీ, తోబుట్టువులు ఎవరూ లేరు.

"వాళ్ళది నెల్లూరు. యింకేమన్నా వివరాలు కావాలా?"

"అబ్బే, అదేం లేదు. అన్నీ తెలిసినవాడివి నీవు వుండగా భయం ఎందుకులే బావా!" వెంకట్రామయ్య గలగల నవ్వుతూ అన్నాడు.

"సరే వస్తా. ఎల్లుండి బాగుంది వెళదాము. పిల్లని చూడటానికి సిద్ధంగా వుండు. పిల్లవాడ్ని పిలిపించు." తన గుబురు మీసాల వెనుక నవ్వు దాచుకుంటూ గడప దాటాడు రాఘవయ్య.. ఆ రోజు సాయంత్రమే సత్తిరాజుకి గర్వంగా చెప్పుకున్నాడు వెంకట్రామయ్య.

సత్తిరాజు వెంకట్రామయ్యకి పట్టబోతున్న అదృష్టాన్ని ఎంతగానో పొగిడాడు ఇంత అదృష్టం ఎవరికీ పట్టదంటూ.

మూడోనాటికల్లా హరితోసహా, రాఘవయ్య, వెంకట్రామయ్య నెల్లూరు ప్రయాణమవుతూ, తమతో రావాలి తప్పదు అంటూ సత్తిరాజును కూడా బల వంతంగా బయలుదేరదీశారు.

పెళ్ళికూతురు ఇల్లు పెద్ద మేడ. బాగానే వుంది. పెళ్ళికూతురు ఇంట్లో పిల్ల తల్లి తప్ప వేరెవ్వరూ లేరు. ఇది మరీ బాగుంది అనిపించింది వెంకట్రామయ్యకి.

పరిచయాలు, క్షేమ సమాచారం, లోకాభిరామాయణం అంతా క్షణంలో ముగిసింది. "పిల్లని పిలిపించండి" అని రాఘవయ్య ఆజ్ఞకి తీసుకురావటానికి తల్లి లోపలికి వెళ్ళింది. రాబోయే ఆ అమ్మాయికోసం ఆత్రంగా చూస్తూ కూర్చున్నాడు హరి.

వున్నట్టుండి మెరుపు మెరిసినట్లయింది.

హరికి, వెంకట్రామయ్యకి కళ్లు జిగేల్ మన్నాయి. పెళ్ళికూతురి అందం సామాన్యమైనదికాదు. బంగారు శలకలాగా వుంది. నవ్వితే ముత్యాలు రాలుతాయా అనిపిస్తుంది. నడుస్తుంటే ఆ నడకలోని వయ్యారాలు సగం ఆ అమ్మాయికి అందం తెప్పించినాయేమో అనిపిస్తున్నది. అందమైన ఆ కాటుక కళ్ళతో అనేక కావ్యాలు వ్రాయవచ్చు అనిపించింది హరికి.

ముగ్ధ మనోహరమైన ఆ రూపాన్ని తనివితీరటం లేదు హరికి ఎంతసేపు చూచినా.

"నీ పేరేమిటమ్మా ?" వెంకట్రామయ్య మెల్లిగా అడిగాడు.

పెళ్ళికూతురు తల మరింత దించుకుంది ఆ ప్రశ్నతో.

"పిల్లకి మహా సిగ్గు." అంటూ రాఘవయ్య సమర్థించాడు.

"వీణాధరి" అంటూ పిల్ల పేరు తల్లి చెప్పింది.

వెయ్యి వీణలు ఒక్కసారిగా మ్రోగినట్లనిపించింది హరి హృదయంలో. పిల్ల రూపం, వాళ్లు యివ్వబోయే కట్నం, చేసిన మర్యాదలు తప్ప హరికి, వెంకట్రామయ్యకి మరో ప్రపంచం తెలియటం లేదు. అక్కడికక్కడే, రాఘవయ్య బలవంతంతో తాంబూలాలు తీసుకోవటం జరిగిపోయింది. అంతా తృప్తిగా యిళ్ళకి చేరారు.

హరికి, వెంకట్రామయ్యకి భూమ్మీద కాళ్లు నిలవటం లేదు.

సత్తిరాజు, రాఘవయ్యలు మధ్యలో ఎటువంటి ఆటంకాలు లేకుండా, పెళ్ళి



కాస్తా జరిగిపోతే తొందరగా చాలని ఆలోచిస్తున్నారు. అనుకున్నదే తడవుగా లగ్నాలు పెట్టుకున్నారు.

పెళ్ళికి విశాలి, విశాలి భర్త ప్రసాద్ పదిరోజులు ముందుగానే వచ్చారు.

పెత్తనమంతా సుశీలమ్మ, సత్తిరాజులకే ఒప్పచెప్పాడు వెంకట్రామయ్య.

కల్యాణ ఘడియలు రానే వచ్చాయి.

అత్యంత వైభవంగా బంధు మిత్రులతో బయలుదేరి వెళ్ళి ఆ పెళ్ళికాస్తా జరిపించుకు వచ్చారు. హరి సంతోషానికి పట్టపగ్గాలు లేవు.

మనస్సంతా వీణాధరిని గురించి ఆలోచించటంతో సరిపోతున్నది.

వీణాధరి తిరిగి నాలుగవనాడు తల్లితో వెళ్ళిపోతుంటే హరికి ఏదోలా అనిపించింది, పన్నెత్తి ఒక్కసారి కూడా పలకరించలేకపోయానే అని.

నెల రోజులు గడిచాక వీణాధరి తల్లి ఉత్తరం వ్రాసింది, అల్లుడుగార్ని పంపవలసింది అంటూ.

వెళ్ళి వీణాధరిని తనతో తీసుకురావచ్చు అనుకుంటూ ఉత్సాహంగా నెల్లూరు బయలుదేరాడు హరి. ఏవేవో ఊహలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ, కోటి కోరికలతో రైలు ఎక్కాడు.

హరి వాకిట్లోకి అడుగుపెట్టగానే, ఆప్యాయంగా పలుకరించింది పిల్లతల్లి రంగమ్మగారు.

వీణకోసం హరికళ్ళు చుట్టూ వెతికాయి. ఇది గమనించి రంగమ్మగారు నవ్వుకుంటూ వెళ్ళి వీణచేత కాఫీ పంపించింది.

వీణ కాఫీ తెచ్చి టేబిల్‌మీద పెట్టిపెట్టకముందే హరి వీణ చెయ్యి అందుకున్నాడు ఆప్యాయంగా. వీణ బిత్తరపోయి తడబాటుగా చూచింది. వీణ కళ్ళల్లో సంతోష చిహ్నాలు బదులు, విచారం అలుముకుంది. కళ్ళల్లో నీరు నిలిచింది. ఇది గమనించి, నుదురు రుద్దుకుంటూ, క్షణకాలం ఆలోచించాడు హరి. ఈ పెళ్ళి వీణకి యిష్టంలేదా ? అనుకుంటూ, వుండబట్టలేక అడిగేశాడు.

"వీణా! ఈ పెళ్ళి నీకు యిష్టంలేదా ? ఎందుకు అంత దిగులుగా వున్నావు?" అని లాలనగా చిన్నగా అడిగాడు.

ఆ మాటలకి ఆశ్చర్యంగా హరి కళ్ళల్లోకి చూచి వేగంగా వెళ్ళిపోయింది. వెళుతూ, వెళుతూ తన చేతిలోని కాగితం టేబిల్‌మీద పెట్టి వెళ్ళిపోయింది.

హరి ఆత్రంగా ఆ కాగితం తీసి చూచాడు.

"మీకు... నమస్కారాలు. మీరు చాలా దురదృష్టవంతులు. డబ్బుకు దాసోహం అని నన్ను కట్టుకున్నారు. ముందు వెనుకలు ఆలోచించలేకపోయినారు. మీ తండ్రికివున్న డబ్బు దాహానికి మీరు బలి అయినారు. చిన్ననాటినుండి మీ మీద ఆశలు పెంచుకున్న "విశాలి"ని కాదన్నారని మీమీద కసితో సత్తిరాజు, రాఘవయ్య మీ గొంతు కోశారు. నోరులేనిదాన్ని కావటంతో జవాబు చెప్ప లేకపోయాను. క్షమించండి... వీణ."

హరి ఆ ఉత్తరం చదువుతూనే కుప్పలా కూలిపోయాడు. చేతులారా చేసుకున్న కర్మకి ఎవర్నని ఏం లాభం. గుండెలు అవిసిపోయేలా ఏడ్చాడు. డబ్బుతోనే ప్రేమలు, ద్వేషాలు పుడ్తాయని తెలుసుకుని కుమిలిపోయాడు.

రోదిస్తూ అలా ఎంతసేపు కూర్చుండిపోయాడో.

వున్నట్లుండి గావుకేకలు వినిపించాయి దొడ్లోనుండి.

హరి గబగబా పరిగెత్తాడు. వీణ బావిలో దూకాలని ప్రయత్నిస్తుంటే తల్లి

కేకలు వేస్తూ గట్టిగా పట్టుకొని ఆపే ప్రయత్నంలో వుంది. హరి వచ్చి గభాల్న ఆపేశాడు.

"ఇదంతా నా కర్మ ...నీదేముంది తప్పు ఇందులో" అంటూ, వెక్కివెక్కి పెట్టి ఏడుస్తున్న వీణ ముఖం చూడలేకపోయాడు.

హరి ఇంక ఒక్క క్షణం కూడా వుండలేకపోయాడు ఆ ఇంట్లో తన ఇల్లు చేరుకున్నాడు హరి.

ముగ్గురి జీవితాలతో చెలగాటమాడిన తండ్రి ముఖం చూడబుద్ధి కాక, తల్లి ఎదురువచ్చి పలకరించబోయినా తప్పుకొని వెళ్ళాడు.

హరికి అయోమయంగా వుంది అంతా. విదేశాలు వెళ్ళాలని, యింక తిరిగి రానని ఉత్తరం వ్రాసి, టేబిల్ మీద పెట్టి, గబగబా సూట్ కేస్ సర్దుకొని ప్రయాణమైనాడు. ఎందుకో విశాలికి క్షమాపణలు చెప్పుకోవాలనిపించింది. తన తండ్రి వాళ్ళని అన్యాయం చేసినందుకు-తనూ విశాలికి ఆశలు కల్పించి, మోసం చేసినందుకు.

సత్తిరాజు ఇంటికి వెళ్ళగానే, ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో ఎవరూ లేనట్లు.

విశాలి కోసం చుట్టూ చూస్తూ లోపలికి వెళ్ళాడు. వంటగదిలో ఏదో పని చేస్తున్న విశాలి, అలికిడి అయి, వెనక్కి తిరిగింది. విశాలి రూపం చూడగానే కెవ్వున కేక వేసి, కళ్లు మూసుకున్నాడు హరి.

"ఏమైంది విశాలి? ఎందుకు అట్లా అయిపోయినావు" అంటూ బాధగా అడిగాడు.

"ఏమవుతుంది బావా! కల్మషం లేని మనస్సులతో జరిగిన పెళ్ళిళ్ల కావు ఇవి. అన్యాయం అక్రమాలతో, పగతో చేసిన పెళ్ళిళ్ళు ఇవి. భగవంతుడు అందరికీ తగిన ప్రాయశ్చిత్తమే చేశాడు. నెలరోజుల క్రితం, తన కంపెనీ పనిమీద ఢిల్లీ వెళ్ళి వస్తుండగా, విమానం కూలి ఆయన మరణించారు."

"అపు... ఇంక చెప్పకు విశాలీ....ఇంక చెప్పకు వినలేను," అంటూ హరి గబగబా అడుగులు వేసుకుంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోతూంటే ఎటుపోతాడో, ఏమైపోతాడో తెలియని విశాలి కన్నీళ్ళమధ్య దీనంగా చూస్తూ నిల్చుండి పోయింది.